




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 800 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# చలం జీవితం - సాహిత్యం

చలం–

చలం గారిని క్లుప్తంగా రచయత అనడం సబబు కాదనుకుంటాను. ప్రాధమికంగా రచయతే అయినప్పటికీ, ఆయననొక వ్యవస్థ. ఆయనొక పోరాటం. ఆయనొక ఉద్యమం. 30 సంవత్సరాల పాటు నితంతరం జ్వలించిన కాగడా. ఇరవైపు శతాబ్దపు సంచలనాత్మక రచయిత. 1920 –50 వరకూ ఆయన రాసిన సాహిత్యం తెలుగుదేశాన్ని ఒక కుదుపు కుదిపింది. స్త్రీ ఆయన రచనలకు కేంద్ర బిందువు. కొన్నిసార్లు చిన్నపిల్లల గురించి కూడా రాశారు. స్త్రీ స్వేచ్ఛ – అంటే...ప్రేమా, మానవసంబంధాల విషయంలో "మగ వాడికి ఎంత స్వేచ్ఛ వుంటుందో, స్త్రీకి కూడా అంత స్వేచ్ఛ వుండాలి" అని ఎలుగెత్తి చాటిన మొట్ట మొదటి రచయిత.తన ప్రతి రచనలోనూ అదే వాదాన్ని ప్రతిబింబించిన సాహితీ విప్లవ యోధుడు రచయిత చలం.

ఆయన రచనల్లో వెలుబుచ్చిన అభిప్రాయాలు ఆనాటి సమాజాన్ని ఉలిక్కిపడేలా చేశాయి. ఆయన రచనల్ని చదవొద్దు అని పెద్ద వాళ్ళు ప్రచారం చేసేవారు. ఇంట్లో పిల్లల కంట పడకుండా ఆయన పుస్తకాల్ని పెద్ద వాళ్ళు దాచేసేవారు. దిండుకింద పెట్టుకొని రహస్యంగా చదివేవారని ప్రతీతి. ముఖ్యంగా ఆడపిల్లలనైతే ఆ పుస్తకాల్ని తాకనిచ్చేవారు కాదు. చూడనిచ్చేవారు కాదు. ఎన్ని విమర్శలొచ్చినా, ఎంత మంది దుమ్మెత్తి పోసినా, యెంత దుమారం చెలరేగినా, ఎంత వ్యతిరేకత పోగుచేసుకున్నా, ఆయన తన ధోరణిని మార్చుకోలేదు.

*★మగవాడికో నీతి. ఆడదానికో నీతి ఎందుకుండాలి?*

*★పెళ్ళయిన మగవాడు ఇతర స్త్రీలతో సంబంధం పెట్టుకుంటే, ఏమీ అనని మీరు స్త్రీ విషయంలో ఎందుకు భుజాలు తడుముకుంటున్నారు.*

అని నీతి సూత్రాలను వల్లించేవారిని నిలదీసి ప్రశ్నించాడు.

*"ఒకసారి మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. మిమ్మల్ని మీరు నగ్నంగా చూసుకోండి. మీరు పైకి చెప్పిన మాటల్ని నిజ జీవితంలో ఆచరిస్తున్నారా?మీలో హిపోక్రసీ లేదా?అలా అని ఒప్పుకునే ధైర్యం ఉందా?"*

అని ఎదురు దాడి చేశాడు. తను రాసిన రచనల నిండా అదే వాదం. అదే ధోరణి. అదే వరస.

తన 55 సంవత్సరాలు వచ్చేవరకూ 30 సంవత్సరాలు పాటు అక్షరాలను అగ్ని కెరటాలుగా ప్రవహింపజేసిన ఆయన, తన జీవితంలోని చివరి 30 సంవత్సరాలూ ఒక్కసారిగా చల్లారిపోయి, ఆత్మ శోధనలోకి వెళ్ళిపోయి, ఏ సమాజన్నయితే ఎదిరించాడో, ఏ స్త్రీ జాతి నైతే "కట్టుబాట్ల కారాగారాల్లో నుండి బయటకు రండి. బంధనాలు తెంచుకు రండి. స్వేచ్ఛగా విహరించండి. మీ జీవితాన్ని, మీరు అనుకున్న రీతిలో జీవించండి"అని నిరంతరం ఘోషించాడో...వాళ్ళందరికీ దూరంగా వెళ్ళిపోయి, "నన్ను నేను తెలుసుకునే అన్వేషణ" అంటూ ఆశ్రమ జీవితాన్ని గడిపి, తన 85 ఏళ్ళ వయసులో1979 లో మరణించాడు.

ఈ కథనం ఎలా ఉండబోతోంది అనే విషయంలో ఒక స్పష్టత ఇస్తాను. నేను చలం గారి సాహిత్యాన్ని చిన్నప్పటినుండీ అంటే హైస్కూలు నుండి చదువుతున్నాను. మొట్టమొదట నన్ను బాగా ఆకర్షించినది ఆయన శైలి. ఆ రోజుల్లో నేను ముందుగా చదివింది ఆయన ప్రేమలేఖలూ, మ్యూజింగ్స్.ఈ రెండు పుస్తకాలూ కొన్ని దశాబ్దాల పాటు నాకు పాఠ్యపుస్తకాలుగా ఏడాదికి 5,6 సార్లు చదువుతుండేవాడిని. ఆ తరువాత ఆయన మిగతా నవలలూ, వ్యాసాలూ చదివాను.

అయితే, చలాన్ని నా కంటే, ఎక్కువగా చదివిన వాళ్ళూ, విశ్లేషించిన వాళ్ళూ చాలామంది వుండి ఉండవచ్చు. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే, ఈ కథనాన్ని మీముందుకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాను. ఈ కథనాన్ని ఎవరిని ఉద్దేశించి రాస్తున్నానంటే...చలం గారి గురించీ, ఆయన సాహిత్యం గురించీ అస్సలు తెలియని పాఠకుల కోసం, అలాగే ఆయన సాహిత్యం తప్ప, ఆయన వ్యక్తిగత జీవితం తెలియని వాళ్ళ కోసం, అలాగే చలంగారి గురించి కొంత మాత్రమే తెలిసి, ఇంకా తెలుసుకోవాలి అనుకునే అభిమానుల కోసమూ ఈ కథనాన్ని మీముందుకు తీసుకువస్తున్నాను.

అందుచేత, చలంగారి గురించి నాకంటే, బాగా తెలిసిన వాళ్ళకి ఈ కథనంలో కొత్త విశేషాలు బహుశా కనిపించక పోవచ్చు. అయినా, నాకంటే ఎక్కువ చదివిన వాళ్ళు, ఈ కథనం చదవడం సంభవిస్తే, ఇందులో ఏవైనా మార్పులూ, చేర్పులూ అవసరం అనిపిస్తే, నాకు తెలియజేస్తే, సరి చేసుకుంటాను. ఈ కథనం యొక్క ప్రధాన ధ్యేయం

ఈ తరానికి చలాన్ని పరిచయం చేయడం. చలం సాహిత్యం– జీవితమూ అత్యంత విస్తృత మైనవీ, వివాస్పదమైనవీ. వీటి గురించి క్లుప్తంగా చెప్పడం అసాధ్యం.ముందుగా ఆయన సాహిత్యం గురించి క్లుప్తంగానైనా తెలుసుకుంటే కొంచెం అవగాహన వస్తుంది. పదండి....

చలం – ఈ రెండు అక్షరాలే సాంప్రదాయవాదుల గుండెల్లో రైళ్ళు పరిగెట్టించాయి. గడపదాటి బయటకు రాలేని, గొంతెత్తి తమ గోడు చెప్పుకోలేని లక్షలాది మూగ గొంతుకులకు, మహిళా గొంతుకులకు ఊరట నిచ్చాయి. స్వాంతనను ఇచ్చాయి. కొన్ని సందర్భాలలో సంకెళ్ళు తెంచుకునే ధైర్యాన్ని ఇచ్చాయి. చలం గారి సాహిత్యం ఆ దశాబ్దాలలోనే కాకుండా, శతాబ్దం పూర్తి చేసుకున్న ఇప్పటికి కూడా సంచలనమే. ఆయన సాహిత్యంలో ని అధిక భాగానికి ప్రాతినిధ్యంవహించే, అలాగే ఆయన భావాలను ప్రతిబింబించే కొద్ది భాగాలను చూస్తే ఆయనంటే ఏమిటో తెలుస్తుంది. అవి ఆయన మాటల్లోనే....

*స్త్రీకి కూడా శరీరం ఉంది. దానికీ వ్యాయామం ఇవ్వాలి. ఆమెకూ మెదడు ఉంది. దానికీ జ్ఞానాన్ని ఇవ్వాలి. ఆమెకూ హృదయం ఉంది. దానికీ అనుభవం ఇవ్వాలి.*

అలాగే ఇంకొక చోట..

*సృష్టిలో తినడం తప్పా, ఏమీ ఎరగనివి జంతువులు. మనుషులు కాదు. ఆడది మాత్రం ఇంకా జంతువుగానే ఉంది. ఇంకా వంట చెయ్యడం, నగలు వేసుకోవడం, నగలు మొయ్యడం.ఇంకా రెండు పనులు ఎక్కువగా నేర్చుకుంది.*

మనం ఒకటి గుర్తు పెట్టుకోవాలి. చలం గారు ఈ మాటలు చెప్పింది 1920–50 ప్రాంతాల్లో. అందువల్ల ఆయన మాటల్ని అర్థం చేసుకోవడానికి గానీ, ఆయన కథల్ని అర్థం చేసుకోసుకునే క్రమంలో ఇది తప్పనిసరిగా గుర్తు పెట్టుకోవాలి. మరోచోట ఏం రాశారంటే...

*"భర్త నీచుడైతే, ఆ సంగతి గుర్తించని స్త్రీ అంతకంటే నీచురాలు.ఆ నీచత్వాన్ని కనిపెట్టి తన భర్తని, ఆ నీచత్వం నుండి తప్పించడానికి ప్రయత్నించని స్త్రీ వ్యర్థురాలు. ప్రయత్నించినా అతను మారకపోతే, ఇంకా వాడికి లోబడే స్త్రీ వ్యభిచారి."*

ఇంత తీవ్రంగా చెప్పారు. ఒకే ఒక్క వాక్యంలో ఆయన జీవన సత్యాన్ని, ఆయన అనుకునే జీవన సత్యాన్ని చెప్పారు.

*"ఆడది భయపడినంత సేపే మగవాడి ధైర్యం."*

*"విద్యలేని అనాగరిక స్త్రీ తన కాపరం మరీ దుర్లభం అయితే, పారిపోతుంది. ఎక్కడో ముష్టిపనీ, దాసీ పనీ, వేశ్యా వృత్తీ యెట్లా అయినా జీవించగలదు. కానీ, చదువుకున్న స్త్రీలు, నాగరీకులు ఆ మూడింటిలో దేనికీ పనికి రారు. అసలు ఇంట్లోనుండి బండి లేనిదే కదలలేరు."*

*"సీత, రాముడితో అడవికి పోయిందనీ, సావిత్రి యముడితో వాదులాడిందనీ, దుర్గమ్మ చీరలు తగలబెట్టి, ఖద్దరు నైను కట్టిందనీ, సూరమ్మ గారు పాతివ్రత్యం మీద మహోపన్యాసం ఇచ్చిందనీ లొట్టలు వేసే మహానుభావుల పవిత్ర నేత్రాలకు, దినదినమూ, నిముష నిముషమూ మనో వాక్కాయ కర్మల మీద, ఏ పత్రిల్లోనూ పేర్లు పడని స్త్రీలు నిలిపే నిగ్రహం కనపడదు. ఇంత మందిని మనం పతివ్రతలని అనుకుంటున్నాము కానీ, సామాన్య స్త్రీలలో కూడా ఎంత మంది నిగ్రహాల్ని పాటిస్తున్నారు అనే విషయం ఏ పత్రికల్లోనూ రాదు. వాళ్ళ గురించి ఎవరూ చెప్పడం లేదు. "*

ఇవన్నీ కూడా ఆయన రచనల్లో అక్కడక్కడ వ్యక్త పరచిన కొన్ని భావాలు.

ఆనాటి స్త్రీ జాతి పట్ల చలంగారి కున్న జాలీ, ప్రేమా, దయా, కరుణా అన్నీ కలసి ఆయనలో కథలూ,నవలలూ, నాటకాలూ, వ్యాసాలూ ఇవన్నీ రాయించాయి. స్త్రీ కి సంబంధించినటువంటి నీతీ, సంపాదనా, విద్యా, స్వేచ్ఛా, వివాహం, ప్రేమా, దాంపత్య జీవితం ఇలాంటి అంశాల నన్నిటినీ కూడా ఆయన చాలా శాస్త్రీయంగా చర్చించారు, తన సాహిత్యం అంతటిలోనూ! ఆ రోజుల్ని ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే, ఆడవాళ్ళ చదువు సంగతి పక్కన పెట్టి, అసలు వాళ్ళు బయటకు రావడమే అపరాధం. అనుకునే వందేళ్ళ క్రిందట చలం గారు ప్రచారం చేసినటువంటి ఈ భావాలు, ఆనాటి సమాజంలోని నీతి సూత్రాల పునాదుల్ని కదిలించే ప్రయత్నం చేశాయి.

ఆయన సాహిత్యాన్ని చదివి ప్రభావితమైన వాళ్ళూ, అలాగే ఆయన ఇచ్చినటు వంటి ధైర్యాన్ని, తమ ధైర్యంగా మలచుకున్న వాళ్ళూ ఆయన శాశ్వత అభిమానులుగా మారిన వాళ్ళూ లక్షలాది మంది వున్నారు ఆ రోజుల్లోనూ, ఇప్పటికీ కూడా. అలాగే ఇంకొక విషయం గురించి కూడా చెప్పుకోవాలి. స్త్రీల తర్వాత, చిన్న పిల్లల గురించి. చిన్న పిల్లల్ని చదువుల పేరుతో ఒక చట్రంలో బిగించేసి, ఒక యంత్రంలాగా తయారు చేస్తున్నారు. "అలా యంత్రాలుగా చెయ్యకండి. వాళ్ళను స్వేచ్ఛగా ఎదగనివ్వండి."అని కొన్ని చోట్లా రాశారు. అంతేకాదు "బిడ్డల శిక్షణ"అనే ప్రత్యేకమైన పుస్తకం కూడా రాశారు. ఇవి చలంగారి సాహిత్యానికి ప్రధాన కేంద్ర బిందువులు.

మరి సహజంగానే ఆడవాళ్ళ గురించి, ఇంత తీవ్రమైన భావాలు వెలుబుచ్చిన చలాన్ని అందరూ ఆమోదించారా? ఆయన్ని వ్యతిరేకించే వారా? ఆయన సాహిత్యాన్నే కాదు, ఆయన్నీ, ఆయన కుటుంబాన్ని కూడా సమాజం నుండి వెలివేసిన వాళ్ళూ, పూర్తిగా బహిష్కరించేవారూ, ఆయనను ఒక భ్రష్టుడిగా, ఆయన భావాలను సమాజానికి పట్టిన చీడపురుగులుగా భావించిన వాళ్ళూ, ప్రచారం చేసిన వాళ్ళూ, ఎదిరించిన వాళ్ళూ కూడా చాలా మంది వున్నారు ఆ రోజుల్లోనే కాదు, ఈ రోజుల్లో కూడా.

*"స్త్రీకి స్వేచ్ఛ ఇవ్వండి"* అంటారు చలం గారు. "*నువ్వు అంటున్నది స్వేచ్ఛ కాదు, విశృంఖలత్వం'*అంటారు ఆయన్ని వ్యతిరేకులు.

*“స్త్రీ జాతిలో ఏమాత్రమైనా చైతన్యం తీసుకురావాలనే నా ప్రయత్నం”*అంటారు చలం గారు. *” లేదు, వాళ్ళను తప్పుదారి పట్టిస్తున్నావు.వాళ్ళను చెడగొడుతున్నావు.”*అంటారు వ్యతిరేకులు.

*“మీలాగా నేను చెప్పేదొకటి, చేసేదొకటి కాదు. చెప్పిందే చేస్తాను. చేసిందే చెబుతాను.అందుకే ఇలా రాస్తున్నాను”*అంటారు చలం.

*“నీకో స్థిరత్వం లేదు. నీకు ఇతరులకు బోధించే హక్కు ఎక్కడనుండి వస్తుంది?”*అంటారు విమర్శకులు.

నిజమే చలం గారి సాహిత్యమూ, జీవితమూ రెండు కూడా వైరుధ్యాలకు నిలయం. అయితే, చలం గారు ఎప్పుడూ దాపరికానికీ, కపటత్వనికీ, హిపోక్రసీకీ లొంగలేదు.అందుకే ఆయనను అంత తీవ్రంగా విమర్శించే వారు కూడా ఆయన నిజయితీకీ నమస్కారం పెట్టకుండా ఉండలేరు.

సరే! ఇన్ని సిద్దాంతాలు చెప్పేరు. ఇంత స్వేచ్ఛా భావాల్ని ప్రచారం చేశారు. ఆయన చెప్పిందే చేశారు. అయితే, ఆయన కుటుంబం, ఆయన స్నేహితులూ ఎలా ప్రభావితమయ్యారు? యెంత సంస్కారాన్ని పొందారు. అంటే...ఆయన జీవితాన్ని పూర్తిగా తెలుసుకున్నాక ఎవరికి వాళ్ళు నిర్ణయించుకోవాలి. అందుకే చలం కొందరికి ఆశ్చర్యార్ధకం. కొందరికి ప్రశ్నార్ధకం. కొందరికి నూటికి నూరుశాతం. కొందరికి ఎందుకూ పనికిరాని శూన్యం. వెరసి చలం. ఒక అశాంతి సముద్రం. నిరంతరం జ్వలించిన ఒక అగ్ని గుండం.

చలం గారు సుమారుగా పది నవలలు రాశారు. ఈ సంఖ్యలో కొంచెం అటూ, ఇటూగా ఉండవచ్చు. 1921లో శశిరేఖ మొదలుకొని.. దైవమిచ్చిన భార్య, అమీనా, మైదానం, వివాహం, బ్రాహ్మణీకం మరికొన్ని. 7,8 నాటకాలు. ఆ నాటకాల్లో అధిక భాగం పురాణాల్నీ, పురాణాల్లో వ్యక్తుల్ని కూడా హేళన చేస్తూ రాశారు. ఇక నాటికల విషయానికి వస్తే, 25 పైగా రాశారు. కథలైతే, వందకు పైగా రాశారు. ఒక్కో నవలా యెంత ప్రాచుర్యం పొందిందో ఒక్కో కథా అంత ప్రాచుర్యం పొందింది. స్త్రీల గురించీ, పిల్లల గురించీ వ్యాసాలు రాశారు. ఆనందం, విషాదం లాంటివి కూడా రాశారు. ఇవన్నీ కాకుండా ఆయనే ఈ సాహిత్య ప్రక్రియకు ఆద్యులు అనుకునేటంతగా “మ్యూజింగ్స్”రాశారు. అంటే మన మనసులో ఎలా అనుకుంటామో అవన్నీ పేపరు మీద పెట్టారు. దానికి సరైన తెలుగు పదం దొరకలేదేమో అందుకే “మ్యూజింగ్స్” అన్నారు. ఈ మ్యూజింగ్స్ తో పాటుగా ఆయన ప్రారంభించిన మరో ప్రక్రియ “ప్రేమ లేఖలు” ఎవరో ఒకమ్మాయికి రాసినట్టుగా ఆయన రాసిన ప్రేమ లేఖలు. అదొక ఊహ పాత్ర. కల్పిత పాత్ర అంటారు. ఆయన జీవితాన్ని గురించి తెలుసుకున్నాక, ఈ ప్రేమ లేఖల గురించి తెలుసుకుందాం.

అంతే కాదు ఆయన చివరి రోజుల్లో భగవద్గీతా, గీతాంజలీ, బైబిలు ఇలాంటివి కూడా సరళమైనటువంటి అనువాదాలు చేశారు. రమణ మహర్షి మీద వచన గేయాలు రాశారు. ఆయన ఏ పుస్తకానికి రాసినటువంటి పీఠిక అయినా గానీ, అత్యంత సాహితీ విలువలు సంతరించుకుంది. శ్రీ శ్రీ గారి మహా ప్రస్థానానికి రాసిన యోగ్యతాపత్రం

గురించి అందరికీ తెలుసు. ఇంక కవితల విషయానికి వస్తే, చలంగారు ప్రత్యేకించి కవితలు రాశారని చెప్పలేం. ఎందుకంటే, చలం గారి ఏ సాహిత్య ప్రక్రియ లోనైనా కవిత్వం జాలువారుతూ వుంటుంది. ఇవే కాకుండా చలం గారి మరో ప్రత్యేకత, ఆయన మిత్రులకు రాసినటువంటి ఉత్తరాలు. ఇదే లేఖా సాహిత్యం. అవన్నీ కూడా పుస్తకాలుగా వచ్చాయి. ఎందుకంటే, వాటిల్లో చలంగారి భావాలూ,చలం గారి జీవితంలో జరిగినటువంటి పరిణామాలూ, వివిధ దశల్లో ఆయన ఎలా అనుకున్నారు. ఆయన భావాలు ఎలా వున్నాయి. ఒక దశ నుండి మరో దశకు ఎలా మారారు. ఇలాంటివన్నీ ఆయన ఉత్తరాల్లో ప్రతిబింబిస్తాయి. ఇదంతా కూడా చలం సృష్టించిన రచనల జాబితా. అయితే, చలం గారి సాహిత్యాన్ని విశ్లేషిస్తూ, విమర్శిస్తూ, ప్రశంసిస్తూ రాసిన గ్రంథాలూ వందలాదిగా వుంటాయి. అందుకే ఆయన సాహిత్యం కంటే, ఆయన సాహిత్యం మీద వచ్చిన విశ్లేషణలు 60, 70 రెట్లు ఉంటుందని ఒక అంచనా.అది యెంత మాత్రమూ అతిశయోక్తికాదు. ఎందుకంటే, ఒక్క 'మైదానం' తీసుకుంటే. వందా, రెండువందలు వ్యాసాలు వచ్చి వుంటాయి. సిద్ధాంత గ్రంథాలు కూడా ఇంకా వస్తూనే వున్నాయి.

ఇక చలం గారు సృష్టించిన పాత్రలు అరుణా, రాజేశ్వరీ, అమీనా, శశిరేఖా వీళ్ళందరూ కూడా, వాళ్ళు నిజమైన వ్యక్తులే అనుకునేటంతగా, వాళ్ళ వ్యక్తిత్వాలను తీర్చిదిద్ది, లక్షలాది మందికి అభిమాన పాత్రులయ్యారు. అందుకే ఆ పాత్రలు ఇప్పటికీ సజీవంగా వున్నాయి.  చలంగారి సాహిత్యం,అందులోని తీవ్రతా ఇదంతా ఒకఎత్తయితే, ఆయన రచనా శైలి ఒక ఎత్తు. ఆయన రచనలు చేసే కొత్తలో గ్రాంథిక భాషనే ఉపయోగించారు. అయితే, అతి తొందరలోనే, బహశా మొదటి సంవత్సరం లోనే, సరళమైన వచనం లోకీ, తనదైనటువంటి కవితాత్మకమైన శైలి లోకి మారారు. ఇప్పటికి కూడా ఆయన భావాలను వ్యతిరేకించేవారు కూడా, ఆయన రచనా శైలిని అభినందించకుండా ఉండలేరు. నిజానికి ఆయన శైలి వల్లనే, ఆయన అభిమానులుగా మారిన వాళ్ళూ వున్నారు.వాళ్ళలో నేనూ ఒకడిని.

శైలి అంటే, ఆ పదాల కూర్పు.భావాలను వ్యక్త పరిచే విధానం. పాఠకుల్ని సరికొత్త లోకాల్లోకి తీసుకువేళతాయి. శ్రీశ్రీ మహా ప్రస్థానానికి రాసిన యోగ్యతాపత్రం మీకు గుర్తు వుండేవుంటుంది. అందులోని కొన్ని వాక్యాలు..."పదండి ముందుకు..అగాధం నుండి బయలుదేరిన నల్లని అలలు, మోహన కొట్టి ఉక్కిరిబిక్కిరై, తుఫాను హోరు చెవుల్లో గింగురుమని, నమ్మిన కాళ్ళకింద భూమి దొలుచుకుపోతుంటే..."ఇంత తీవ్రంగా ప్రభావితం కలిగిస్తుంది శ్రీ శ్రీ కవిత్వం అందుకని ఇది చదివితే, చలమే నయమని నా దగ్గరకు పరిగెత్తుకు వస్తారు"అని రాస్తారు.

నిజానికి అగాధం నుండి బయలుదేరిన నల్లని అలలు మోహాన కొట్టడం, ఉక్కిరిబిక్కిరి అవ్వడం, తుఫాను హోరు చెవుల్లో గింగురు మనడం, నమ్మిన కాళ్ళ కింద భూమి దొలుచుపోవడం ఇవన్నీ కూడా నా ఉద్దేశ్యం ప్రకారం శ్రీ శ్రీ కే కాదు.చలానికి కూడా నూటికి నూరు శాతం వర్తిస్తాయి. మచ్చుకు కొన్ని....

*"ఎవరైనా రచయిత కావాలంటే...బాధ పడాలి, నలగాలి జీవిత రథ చక్రాల కింద. కలంలో నుండి నెత్తురు ఒలకాలంటే అక్షరాలా?పాండిత్యమా? కాదు. సంవత్సరాల మూగ వేదన. అంధకారంలో అన్వేషణ. దీనజీవుల హృదయాంతర విషాదం. దిక్కులేని దుర్బలుల జీర్ణావేశం. ఎవ్వరితోనూ చెప్పుకోలేని అధమ బాధితుల గర్భశోకం...."* ఇదండీ చలంగారి శైలికి ఒక చిన్న ఉదాహరణ. మల్లెపూల గురించి ఇలా చెబుతారు.

*"మల్లెపూలు. తెల్లని మల్లెపూలు. విచ్చిన మల్లెపూలు. సాయంత్రాలు స్నేహానికి చల్లని శాంతి నిచ్చే మల్లె పూలు.అర్ధ రాత్రులు విచ్చి, జుట్టు పరిమళంతో కలసి, నిద్రలేపి, రక్తాన్ని చిందులు తొక్కించే మల్లెపూలు. ఒళ్ల మధ్యా, చేతుల మధ్యా నలిగి, నశించిన పిచ్చి మల్లెపూలు. రోషాలూ, నవ్వులూ, తీవ్రమైన కోర్కెలతో తపించి వాడిపోయిన మల్లెపూలు. సన్నని వెన్నెట్లో, ప్రియురాలి నుదిటి కన్నా తెల్లగా, ఏమి చెయ్యాలో తెలియని ఆనందంలో గుండె పట్టి చీలికలు చేసే మల్లెపూలు. తెల్లారగట్ల లేచి చూసినా, ఇంకా కొత్త పరిమళాలతో, రాత్రి జ్ఞాపకాలతో ప్రశ్నించే మల్లెపూలు. ఒక్క స్వర్గంలో తప్పా ఇలాంటి వెలుగూ, తెలుపూ లేదేమో అనిపించే మల్లెపూలు. అలసి నిద్రించే రసికత్వానికి జీవనమిచ్చే మల్లెపూలు. రాత్రి సుందర స్వప్నానికి సాక్షులుగా అవి మాత్రమె మిగిలిన నా ఆప్తులు మల్లెపూలు...."*

ఇవి చలంగారి style కి ఒక ఉదాహరణలు.

ఇలా ఆయనతో ఎవరైనా "మీ రచనా శైలి అద్భుతంగా అవుంతుంది." అని అంటే, ఆయన ఏమనే వారంటే..."style...style...style...ఇలా పొగిడి నా style ని ప్రోత్సహించి, నా బాధనీ, నా బాధ వెనుక మండుతూ ఈ సిరా లోనించి, మీ హృదయానికి పలకాలని చూసే మూగ కంఠాల క్షోభ వినపడకపోతే, మూల మూలా, అణిగి అణిగి నశించి ధీర వనితల ఆక్రందన వినపడకపోతే...నేను రాసి ఏం లాభం. మీరు చదివి ఏం లాభం. నా శైలిని కాదండీ. నా భావాలను అర్థం చేసుకోండి"అని రాశారు.

అసలు ఇంత తీవ్రమైన భావాలూ, శైలీతో ఆయనకు ఎందుకు రాయాలనిపించింది? ఆయన మాటల్లోనే...."మొదట్లో నాకూ, సారస్వతానికీ సంబంధం లేదు. నేను చూస్తున్న అన్యాయాల వల్లా, ఘోరాల వల్లా, నేను మండి పోయాను. ఆ మంట నాలో ఇమడక కథ అయ్యింది. నాకు రచయిత కావాలనే ఆశ లేదు. నేను రాసిన దానికి రస ప్రపంచంలో ఒక విలువ ఉంటుందని కూడా నాకు తెలీదు. అయితే, నా మొదటి కథ నుండి నా పాఠకులు బిగ్గరగా ఏడ్పులు ప్రారంభించారు. ఆ ఏడ్పులే, నా ఉత్సాహం. ఆ నెయ్యి, నా మంటల్లో పడి భగ్గుమని ఇంకొక ధ్వని వినిపించేది. అందుకని రాశాను" అని ఆయనే చెప్పుకున్నారు.

మరి చలంగారు ఇంత సాహిత్యం సృష్టిస్తున్న రోజుల్లోనే, సమాంతరంగా విశ్వనాథ సత్యన్నారాయణ గారు కూడా ఆయన శైలిలో ఆయన కూడా రాసుకుంటూ వెళ్లారు. విశ్వనాథ సత్యన్నారాయణ గారు, చలం గారికంటే ఒక సంవత్సరం మాత్రమే చిన్నవాళ్ళు. మరి విశ్వనాథ సత్యన్నారాయణ గారు చలం గారి గురించి ఏమనుకునేవారో ఆయన

మాటల్లోనే చూద్దాం ”నవ్య సాహిత్యం యొక్క చివరి రెండు దశల్లోనూ ఒక శక్తివంతమైన వాడుక భాషా రచన చేయగలిగిన గద్య రచయితగా పిడుగువలే ప్రవేశించాడు చలం. ఆయన భావాలు నచ్చని వారు వున్నారు. ఆధునిక సారస్వతమంటే ఆయన పేరెత్త కుండా వీలులేదు. ఆయన నవలలూ, నాటికలూ రాశారు. ఆయన పేరు గుడిపాటి వెంకటచలం గారు. ఆయన తెలుగు ప్రభంధాలు చదువు కోలేదంటారు. ఇంగ్లీష్ చదువుకున్నారు. ఆయన రాసేవన్నీ ఇంగ్లీష్ భావాలే. కానీ, ఆయన రాసేది మాత్రం అచ్చమైన తెలుగువాడి నోట, వాడి హృదయం లోనుండి వచ్చే భాష. ఆయన రాసే ప్రకృతి వర్ణనలు, తెలుగు దేశంలో నువ్వూ, నేనూ చూసేవి. ఆయన భాషను గురించీ, భావుకత్వం గురించీ నేను ఎంతయినా పొగుడుతాను. “అని అన్నారు విశ్వనాథ. ఆయన సాధారణంగా అంత తొందరగా ఎవరినీ మెచ్చుకునే వారు కాదు. కానీ, చలం గారి గురించి ఇంతగా మెచ్చుకున్నారు.

అయితే, శ్రీశ్రీ గారి విషయంలోనూ, చలం గారి విషయం లోనూ ఒక చిన్న ఇబ్బంది ఏమిటంటే, వాళ్ళ గురించి మాట్లాడాలంటే, వాళ్ళ మాటలు లేకుండా చెప్పలేం. అందుకే శ్రీశ్రీ గారి గురించి చెబుతూ ఒకాయన అన్నారు “తెలుగులో మాకు పదాలు లేకుండా చేశావయ్యా! నీ గురించి మాట్లాడాలంటే, నీ మాటలే వాడాల్సి వస్తుంది”అని. చలం గారి విషయంలోనూ అదే నిజం. చలం గారు రాసిన ఏ ప్రక్రియ లోనైనా ఆయన సాహిత్యం నిండా “కోటబుల్ కోట్స్” పుంఖాను పుంఖాలుగా వుంటాయి. అలాంటి వాక్యాలు రోజుల తరబడి, వారాల తరబడి ఆలోచింప జేస్తుంటాయి. చలం గారి సాహిత్యం శతాబ్దం దాటినా ఇంకా, పదునుగా వుందనిపించడానికి ఇలాంటి “కోటబుల్ కోట్స్”ఒక కారణం. ఇక ఆయన వెలుబుచ్చిన భావాలను పక్కన పెట్టి, రచయితగా చూద్దాం చలం గారిని. ఆయన రచనలోని శిల్పాన్నీ, వాక్య నిర్మాణాన్నీ, కథను యెంచుకోవడం, పాత్రల్ని పొడిగించడం, ముగింపు ఇలాంటివన్నీ చూస్తే, ఇరవయ్యవ శతాబ్దంలోని విశిష్టమైన, ప్రామాణికమైన, ఉత్తమమైనకథా రచయితలు ఎవరు అంటే...వాళ్ళలో ప్రథమ పక్తిలో చూడవలిసినది చలం గారిని.

సరే! బాగానేవుంది. ఇంత సంచలనం సృష్టించారు. ఇంత తీవ్రమైన భావాలు వెలిబుచ్చేటటువంటి రచనలు చేశారు. మరి ఆ సాహిత్యం ప్రజలకు ఎలా చేరింది? ప్రజలకు చేరాలంటే రెండు విధానాలు. ఒకటి పత్రికల్లో పడాలి.రెండు ఆయన పుస్తకాలు వేసుకుంటే కొనేవాళ్ళు వుండాలి. మరి ఇలాంటి వన్నీ ఆరోజుల్లో ఎలా జరిగాయి? 'ఆ రోజులు' అని మళ్ళీమళ్ళీ ఎందుకు అనుకోవాలి అంటే..ఆయన రాసిన భావాలు అత్యంత తీవ్రమైనవీ, సమాజానికి పూర్తిగా వ్యతిరేకమైనవీ. సమాజంలోని సాంప్రదాయవాదుల్ని పూర్తిగా ఎదిరించినవి. మరి అలాంటి సాహిత్యం ప్రజలదగ్గరకు ఎలా చేరింది? చూద్దాం.

ఆయన రచన ఏదైనా గానీ, పత్రికలు ప్రచురించడానికి భయపడ్డాయి. కొంతమంది బహిష్కరించారు కూడా. ఉదాహరణకు ‘భారతి’ పత్రిక. చాలా సంవత్సరాల పాటు వెయ్యలేదు. అయితే, తరువాత..తరువాత...పత్రికలే కావాలని

ఆయన రచనలు వేశాయి. కాకపోతే, చలంగారు పత్రిక వాళ్ళు అడగనిదే, తనంత తానుగా ఏ పత్రిక్కీ రచనలు పంపించేవారు కాదు.

రికార్డుల ప్రకారం చెప్పుకోవాలంటే, మొట్టమొదటిసారిగా చలంగారి కథలు ప్రచురించడం ప్రారంభించడం పత్రిక 'సాహితి'. కొడాలిఆంజనేయులు గారి సంపాదకత్వంలో వస్తుండేది. కొడాలి ఆంజనేయులు గారంటే, విశ్వనాథ సత్యనారాయణ గారికి మిత్రుడు. ఆ తర్వాత హైదరాబాద్ నుండి 'సుజాత'అనే పత్రిక వచ్చేది.ఆ పత్రిక వాళ్ళూ వేశారు. తరువాత 'చిత్ర గుప్తా' అనే పత్రిక వాళ్ళు చలంగారి "మైదానం"నవలని 2,3సంచికల వరకూ వేసి ఆపేశారు. 'ప్రేమలేఖలు' కూడా 'యువవాణి' అనే పత్రికలో కొంత వరకూ వచ్చి, ఆ తరువాత వేరే పత్రికలో వచ్చింది. 'మ్యూజింగ్స్' మొత్తం దాదాపు ఇరవై సంవత్సరాల పాటు రాశారు. ఇది పాటిబండ్ల మాధవరావు గారి సంపాదకత్వం వహించిన 'వీణ' పత్రికలో కొంత, మరికొంత వేరే పత్రికలో వచ్చింది. చక్రపాణి గారు సంపాదకత్వం వహించిన ఆంధ్రజ్యోతి లో కూడా మ్యూజింగ్స్ వచ్చింది. ఇందులో చలంగారి కథలు కూడా వచ్చేవి. 'భారతి' 19 14-15 లో ప్రారంభం అయింది.అప్పట్లో 'భారతి' సాహిత్యానికి ఒక ప్రామాణికంగా వుండేది. అప్పట్లో ఆ 'భారతి' లో చాలా సంవత్సరాల పాటు చలం గారి రచనలను ప్రచురించలేదు. దాని రజతోత్సవ సంచిక కోసం చలం గారిని "ఒక కథ పంపించండి"అని అడిగారు. దానికి చలం గారు "పాతికేళ్ళకి చలం కావలిసి వచ్చాడా?"అన్నారట. "మీరు ఏమైనా అనండి. మీ కథ కావాలి"అన్నారట భారతి సంపాదకుడు శంభు ప్రసాద్ గారు. అప్పుడు "ఓ పువ్వు పూసింది"కథను రాసి పంపించారు.అది మొట్ట మొదట భారతిలో వచ్చిన చలం గారి రచన. దీనిని తరువాత పరిచయం చేస్తాను. అలాగే "మృత్యువు"అనే వ్యాస సంపుటి "ఉదయిని"లో వచ్చింది. ఇవి పత్రికల్లో వచ్చిన వివరాలు.

ఇక పుస్తకరూపంలో ఎలా వచ్చాయి అంటే – చలం గారి పుస్తకాలను ప్రచురించడానికి ఏ పుస్తక సంస్థా ముందుకు రాలేదు. అందుకని ఏం చేశారంటే చలం గారి తమ్ముళ్ళే,"రజిత ప్రెస్"అని ఒక ప్రెస్ నడుపుతుండేవారు. వాళ్ళు చలం గారు రాసిన "సత్యం-శివం-సుందరం" అనే పుస్తకాన్ని మొట్ట మొదటిసారిగా ప్రచురించారు. అయితే, ఎక్కువగా ఎవరూ కొనలేదు. దాదాపుగా పొట్లాలకే వెళ్ళిపోయింది. అయితే, మొట్ట మొదటిసారిగా చలం గారి పుస్తకాలని అందంగా ముద్రించి ప్రజల్లోకి తీసుకువచ్చింది "సరస్వతీ గ్రంథ మండలి"వారు. వాళ్ళు "చిత్రాంగి"అనే పుస్తకాన్ని 1924 లో, అలాగే 'శశిరేఖ', పద్మ రాణి అనే పుస్తకాల్ని ప్రచురించారు.

తరువాత బందరులో కొంతమంది చలం గారి శిష్యులూ,అభిమానులూ కలసి చలం గారి పుస్తకాలను ప్రచురించడానికి "అభిసారిక గ్రంథ మండలి"అనే ప్రచురణ సంస్థను ప్రారంభించి, చలంగారి పుస్తకాలను వేసేవారు. ఇన్ని అడ్డంకులు దాటాక, చక్రపాణి గారి యొక్క "యువ బుక్ డిపో"వాళ్ళు చలం గారి పుస్తకాలను ప్రచురించడం ప్రారంభించారు. ఇది 1940-50 మధ్యలో.తరువాత "దేశీ కవితా మండలి" వాళ్ళు వేసేవారు. ఆ తరువాత చాలా

ప్రచురణ సంస్థలు ప్రచురించాయి. “చలంగారి మిత్రులు” అనే పేరుతో కొంతమంది వేసేవారు. ప్రస్తుతం “అరుణా పబ్లిషింగ్ హౌస్” వారి దగ్గర ఉన్నట్లున్నాయి. చలం గారి రచనలు ప్రజలకు చేరే క్రమంలో ఇన్ని జరిగాయి.

అదలా ఉంచితే ఆయన వ్యక్తిగత జీవితం ఎలా వుండేది? కుటుంబ సభ్యులతో ఎలా వుండేవారు? వాళ్ళు ఈయన తో ఎలా వుండేవారు? ఇవన్నీ చాలా వివరంగా తెలుసుకోవాలి. చలంగారు 1894లో జన్మించారు. ఆ తరువాత ఒక్క సంవత్సరానికే విశ్వనాధ సత్యనారాయణ గారు వేరే వూరిలో జన్మించారు. 11 ఏళ్ళు వచ్చేవరకూ చలం గారు చాలా నిష్ఠగా పెరిగారు. ఒకసారి ఇంట్లోనుండి బయటకు వచ్చి కాలేజీలో చేరాక, బ్రహ్మ సమాజం ప్రభావం బాగా పడింది. దాంతో, కులబేధాలు వుండకూడదు అని చెప్పేసి, యజ్ఞోపవీతాన్ని తీసివేయడమే కాకుండా, భార్య మెడలో మంగళ సూత్రాన్నికూడా తీసేశారు. అలా ప్రారంభమయ్యాయి ఆయన ఆలోచనలు – ఆస్తికత్వం నుండి బ్రహ్మ సమాజపు భావాలవైపూ! తరువాత టీచరుగా వుద్యోగం, ట్రైనింగ్ కాలేజిలో పనిచేశారు. ఆ తరువాత స్కూల్స్ ఇనస్పెక్టర్ గా పనిచేశారు. దాదాపు ఆంధ్రదేశంలో పది. పదిహేను ఊర్లలో తిరిగారు. ఆ ఊర్లలో తిరిగే రోజుల్లోనే ఇన్ని పుస్తకాలు రాయడం, ఇన్ని వివాదాలకు కేంద్ర బిందువు కావడం జరిగింది. అయితే, ఎక్కడ వుద్యోగం చేసినా గానీ, పై అధికారులతో తగాదాలు. అందుచేత తరచూ బదిలీలు. ఎక్కడ వున్నాగానీ అప్పటికే సమాజంనుండి వెలివేయ బడడం, వూరికి దూరంగా ఎక్కడో పూరి గుడిసెల్లోనో, లేకపోతే మహమ్మదీయులు ఉన్నటువంటి వీధుల్లోనో, రాజమండ్రి గోదావరి ఒడ్డున చాలా దూరంగా వుండడం జరిగాయి. అంతేకాకుండా ఆయన జీవితంలో చాలామంది స్త్రీలు ప్రవేశించారు. నవలలో ఎలా అయితే, స్త్రీ పాత్రలను స్వేచ్ఛాప్రియులుగా చిత్రించారో, నిజ జీవితంలో కూడా అలాగే ప్రవర్తించారు. తన స్త్రీ లోలత్వనికి తనే విసుక్కున్నారు. "నాకు పెళ్లయిందీ, పిల్లలున్నారు.ఒకావిడ నా దగ్గర కొచ్చింది.ఆమెతో ఉంటున్నాను. మళ్ళీ ఇంకొకావిడవైపు నేనెందుకు చూస్తాను?నాలో ఎందుకిలా జరుగుతోంది?”అని తనను, తనే తిట్టుకుండేవారు.

ఇదంతా కూడా 1920– 50 వరకూ జరిగింది. ఈ దశలోనే పెద్దకొడుకు చనిపోయాడు. రెండో కొడుకు ఇల్లు వదలి వెళ్ళిపోయాడు. పెద్దమ్మాయి సన్యాసినిగా మారిపోయింది. రెండో అమ్మాయి కూడా వేరే ఏదో శిష్యురాలిగా అయ్యింది. ఒక్క మూడో అమ్మాయికి మాత్రం వివాహం అయ్యింది. ఒకానొక సందర్భంలో కుటుంబం అంతా కలిసి ఆత్మహత్య చేసుకుందామని అనుకున్నారు. సరే! ఆ ప్రమాదం తప్పి, అందరూ కలసి “రమణ మహర్షి”ఆశ్రమానికి వెళ్ళి, అక్కడే ఉండిపోయారు. ఇదండీ.. చలంగారి వ్యక్తిగత జీవిత సంగ్రహం. ఇంతకీ – ఇలా ఎందుకు జరిగింది?ప్రతి పరిణామ దశలోనూ చోటుచేసుకున్న సంఘటనలేమిటి? ఎదురైన సన్నివేశాలేమిటి? — ఇలాంటి వివరాలన్నీ మనం రాబోయే భాగాలలో తెలుసుకుందాం. ఇది మొదటి భాగం.. కేవలం ఉపోద్ఘాతం మాత్రమే. వచ్చే భాగంలో చలంగారి రచనలు కొన్నింటిని పరిచయం చేస్తాను. అంటే ఇంతవరకూ చలంగారిని చదవని వాళ్లకి చలంగారి రచనల గురించి ఒక అవగాహన వస్తుంది. ఆ తర్వాత చలంగారి వ్యక్తిగత జీవిత విశేషాల్లోకి వెళ్దాం.

**(కొనసాగింపు వచ్చేనెలలో)**

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 జనవరి 19 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

.

COMMENTS

కౌముది